క్లుప్తంగా

భావ విప్లవ దిశా నిర్దేశకుడు రావిపూడి



రావిపూడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: ఆసియాలోనే భావ విప్లవ దిశా నిర్దేశకుడు రావిపూడి వెంకటాద్రి అని పలువురు పేర్కొన్నారు. స్థానిక పోలమ్మ చెరువు వద్ద గల బుద్ధ విహార్‌లో ప్రజ్ఞ సాహితీ వ్యవస్థాపకుడు పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్వర్యంలో రావిపూడి వెంకటాద్రి సంతాప సభ నిర్వహించారు. రావిపూడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వజన కళామండలి అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, కేవీవీ సత్యనారాయణ, కె.రాజశేఖర్, కేఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ మహాసభలు

అమలాపురం టౌన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1939లో స్థాపించిన అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర మహాసభలు ఈ నెల 25, 26 తేదీల్లో కాకినాడ సీబీఎం కాలేజీ ఆవరణలో జరుగుతాయని సంస్థ రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం అమలాపురం ప్రెస్ క్లబ్ భవనంలో మహాసభలను విజయవంతం చేసే అంశంపై సమావేశం నిర్వహించారు. మహాసభలకు ఫార్వర్డ్ బ్లాక్ ప్రతినిధులు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాసభల బ్రోచర్లను విడుదల చేశారు. సమావేశంలో ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ అధ్యక్షుడు ముత్తాబత్తుల వెంకన్నయ్య, కార్యదర్శి కొంకి రవితేజ, ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సాయిబాబు ప్రసంగించారు.

పుష్కర నదీ జలాభిషేకం స్టాల్ ఏర్పాటు

ఐ.పోలవరం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 18న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో పుష్కర నదీ జలాభిషేకం నిర్వహించే స్టాల్‌ను ఆలయ ఆవరణలో అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున దేశంలో పుష్కరాలు జరిగే పవిత్రమైన సంగమాల నుంచి జలాలు తెచ్చి పరమశివునికి అభిషేకం చేస్తామన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా గిడుగు వర్ధంతి

అమలాపురం టౌన్: వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు వర్ధంతి కార్యక్రమం స్థానిక భూపయ్య అగ్రహారంలోని రుద్రరాజు కాంప్లెక్స్‌లో ఆదివారం జరిగింది. జిల్లా శ్రీశ్రీ కళావేదిక, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మురమళ్లలో ఉచిత వైద్య శిబిరం

ఐ పోలవరం: కాకినాడ అపోలో వైద్యుల ఆధ్వర్యంలో మురమళ్ల గ్రామంలో సన్‌ల్యాబ్ నందు ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని పానకాల సతీష్ ప్రారంభించగా ఆర్థోపెడిక్, లేప్రోస్కోపిక్, యూరాలజిస్ట్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, లివర్ స్పెషలిస్ట్‌లు, జనరల్ మెడిసిన్ వైద్యులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చటర్జీ, జీవీరావు, కరుణాకర్‌రెడ్డి, మురళీకృష్ణ, మనోహర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఎన్నిక

ఐ పోలవరం: ది మురమళ్ల ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీధి నాగభూషణం పర్యవేక్షణలో కొత్తకమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా గుత్తాల అన్నవరం, అధ్యక్షుడిగా రాయపురెడ్డి వరబాబు, ఉపాధ్యక్షుడిగా అప్పారి సత్యనారాయణ(చంటి), కార్యదర్శిగా నవరపు రత్నంరాజు, సహాయ కార్యదర్శిగా మానేపల్లి ఆదినారాయణ, కోశాధికారిగా గుర్రాల ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వెంకాయమ్మ మృతి

అమలాపురం రూరల్: తాండవపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు గుత్తుల వెంకాయమ్మ(66) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మూడు దశాబ్దాలుగా సీపీఎం నాయకురాలిగా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలిగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. వెంకాయమ్మ మృతికి సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిమాల వసంత కుమార్, సామాజిక కార్యకర్త పచ్చిమాల బాబ్జి, పోతుమూడి రవికుమార్ తదితరులు సంతాపం తెలిపారు.

పంట పొలాల్లోకి ఉప్పునీరు

- బెండాకాలువ-4 పొడవునా ఆక్రమణలు, పూడికలు
- గయాళ్లుగా మారిన బంజరు భూములు
- రెండేళ్లుగా వరి నాట్లు వేయని వ్యవసాయ క్షేత్రాలు



గయాళ్లుగా దర్శనమిస్తున్న ఊసర వ్యవసాయ క్షేత్రాలు

అల్లవరం: పేరుకేమో పెద్ద గ్రామం. విశాలమైన వ్యవసాయ క్షేత్రాలు.. నాలుగు కిలోమీటర్ల పొడవునా సముద్ర తీరం.. తీరం పొడవునా సరుగుడు తోటలు, ఆక్వా చెరువులు.. జనాభాపరంగా అల్లవరం మండలంలో తొలి స్థానాన్ని ఆక్రమించుకున్న ఊరు.. అదే కొమరగిరిపట్నం.. సెంట్రల్ డెల్టాకు శివారున, సముద్ర తీరానికి ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో నేడు వ్యవసాయం కనుమరుగవుతోంది.. బెండకాలువ-4 పొడవునా ఆక్రమణలు, పూడికలతో పాటు సముద్ర ఆటుపోటు ప్రభావంతో ఉప్పునీరు ఎదురెక్కడంతో పెద్ద ఎత్తున వ్యవసాయ క్షేత్రాలు సాగుకి దూరమవుతున్నాయి.

కాలువ పొడవునా ఆక్రమణలు

కొమరిగిరిపట్నంలో సుమారు 2000 ఎకరాల విస్తీర్ణంలో సాగు భూములున్నాయి. కాని బెండా కాలువ-2 పరిధిలోని వరి పొలాలు మాత్రమే వరి సాగు చేస్తున్నారు. తుమ్మలపల్లి కెనాల్ సెంటర్ నుంచి బెండమూర్లంక సెంటర్ మీదుగా మిలటరీ కాలనీ వరకూ విస్తరించి ఉన్న బెండా కాలువ-4 పరిధిలో ఉన్న 400 ఎకరాలకు గాను 150 ఎకరాల వ్యవసాయ భూమికి నీరందక సాగుకు దూరమవుతున్నాయి. బెండకాలువ-4 పొడవునా ఆక్రమణలతో సాగునీరు శివారు ప్రాంతాలకు చేరడం లేదు. గత నాలుగేళ్లుగా ఖరీఫ్ పంట దూరమైన రైతన్నకు కొద్దో గొప్పో రబీతోనే రైతు గట్టెక్కుతాడనుకుంటే సాగు నీరందక రెండేళ్లుగా నిరాశే మిగిల్చింది. గతేడాది కొంత మంది రైతులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఊసర వ్యవసాయ క్షేత్రాల్లో 70 ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే సాగు నీరు అంతమాత్రంగానే రావడంతో ఆశించిన స్థాయిలో ప్రయోజనం దక్కలేదు. బెండా కాలువ పొడవునా ఆక్రమణలు, చెత్తా, చెదారం, మట్టితో నిండిపోయి సాగునీరు శివారు ప్రాంతాలకు చేరడం లేదు. దీంతో బెండాకాలువ-4 పరిధిలో సుమారు 100 ఎకరాలకు పైగా వ్యవసాయ క్షేత్రాలు గయాళ్లుగా దర్శనమిస్తున్నాయి.

ఉప్పునీటితో ముప్పు

పంచనీటి కాలువ ఆటుపోటు ప్రభావంతో వరి క్షేత్రాల్లోకి ఉప్పునీరు ఎదురెక్కుతుంది. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న కొంత మంది రైతులు వ్యవసాయ క్షేత్రాలను రొయ్య చెరువులుగా మార్చేందుకు కొంత కాలంగా ప్రయత్నాలు చేస్తూ ఉప్పునీటిని గయాళ్ల భూములకు మళ్లించి వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్నారు. మూడు పంటలు పండే భూములు నేడు గయాళ్లుగా దర్శనమిస్తున్నాయని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊసర భూముల్లో వరి పండాలంటే బెండాకాలువ-4కి పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గోపాయి లంక నుంచి శివారు ప్రాంతాలకు వస్తున్న కౌశిక కాలువలో చెత్త చెదారాన్ని పూర్తి స్థాయిలో తొలగించి, వంతుల వారీ విధానాన్ని అమలుచేస్తే బెండా కాలువ-4 కి సాగునీరు అందుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



చెత్త, చెదారం, పూడికతో నిండిపోయిన బెండాకాలువ-4

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- లచ్చిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం



స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం లచ్చిపాలెం పంచాయతీ పరిధిలోని లచ్చిపాలెం కాలనీ, పెదబాపనపల్లి, లచ్చిపాలెం, ఉప్పంగల పంచాయతీ పరిధిలోని తంగేటిపంపు గ్రామాల్లో మూడో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ రాయుడు సునీత, స్థానిక సర్పంచ్‌లు అనిశెట్టి సీతారత్నం, శాఖా శంకరుడు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్‌లు అనిశెట్టి శ్రీనివాసరెడ్డి, దవులూరి శ్రీరామ్మూర్తి తదితరులతో కలిసి ఎమ్మెల్యే పొన్నాడ ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే గత మూడున్నరేళ్లలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించారు. పలుచోట్ల మహిళలు ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ముమ్మిడివరం నియోజకవర్గంలో రాబేయే 25 ఏళ్ల వరకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ తెలిపారు. ఉప్పంగల పంచాయతీ తంగేటిపంపు, లచ్చిపాలెం పంచాయితీ లచ్చిపాలెం కాలనీలో తాగునీటి సమస్య నివారణ కోసం ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.60 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు ట్యాంకులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు దున్నా జనార్థనరావు, కుడిపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, నాయకులు టిల్లపూడి నాగేశ్వరరావు, కొపనాతి నాగరాజు, పెట్ల సూర్యనారాయణ రాజు, కాకి లక్ష్మణస్వామి, ఎంపీడీఓ ఎం.అనుపమ, పంచాయతీ కార్యదర్శి ఎం.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలీస్ ఉద్యోగ పరీక్ష



శ్రీనివాస ఇంజినీరింగ్ పరీక్షా కేంద్రం వద్ద రాత పరీక్షకు క్యూ కట్టిన అభ్యర్థులు

కాట్రేనికోన: చెయ్యేరులో శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ స్వయం ప్రతిపత్తి కళాశాలలో పోలీస్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రంలో 1,000 మంది అభ్యర్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 896 మంది హాజరయ్యారు. పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులను కాట్రేనికోన ఎస్ఐ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు చెక్‌చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. కళాశాలలో అభ్యర్థులకు అవసరమైన మౌలిక వసతులను యాజమాన్యం కల్పించింది.

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలంలో పోలీస్ కానిస్టేబుల్ నియామకాలకు నిర్వహించిన రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మండలంలో తారా కళాశాల, ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల, చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరంగ్ కళాశాలలో మొత్తం 1470 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎయిమ్స్ కళాశాలలో 400 మందికి 356 మంది, తార కళాశాలలో 250 మందికి 224 మంది, శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో 1000 మందికి 896 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఎస్ఐ కె.సురేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆయా పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తీ నిర్వహించారు.

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షలు ప్రశాంతగా జరిగాయి. 1044 మంది అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించగా 121 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం నిర్వాహకులు తెలిపారు. తొలుత ఎస్ఐ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో రాత పరీక్షలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇన్విజిలేటర్లు, పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు.

కోరంగిలో ప్రశాంతంగా..

తాళ్లరేవు: కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాలలోని రెండు కేంద్రాలలో నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షకు 1,749 మంది హాజరైనట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆదివారం ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం రెండువేల మందికిగానూ 251 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 1,417 మంది పురుషులు, 332 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. నిర్ణీత సమయానికి నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు హెచ్చరించడం సత్ఫలితానిచ్చింది. దాదాపు అందరూ సమయానికే పరీక్షా కేంద్రానికే చేరుకున్నారు. పలువురు 10 గంటల సమయంలో పరుగెత్తుకుని పరీక్షా కేంద్రానికి రావడం కనిపించింది. వారిని పరీక్షించి లోనికి అనుమతించారు. కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.

కొలువుదీరిన 'వ్యాపార' ప్రదర్శన

అమలాపురంలో బీఎన్ఐ ఎక్స్‌పో ప్రారంభం



బీఎన్ఐ ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన స్టాల్స్

అమలాపురం టౌన్: బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్(బీఎన్ఐ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎక్స్‌పో స్థానిక గంగరాజు ఫంక్షన్ హాలులో ఆదివారం ప్రారంభమైంది. వివిధ కంపెనీల ఉత్పత్తులకు సంబంధించిన వస్తువులతో 50 స్టాల్స్ ఏర్పాటయ్యాయి. ఈ ఎక్స్‌పో మూడు రోజుల పాటు ఇక్కడ కొనసాగనుంది. బీఎన్ఐ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీకర్ మాట్లాడుతూ ప్రస్తుతం బీఎన్ఐ అంతర్జాతీయంగా 76 దేశాలతో అనుసంధానమై 2.99 లక్షల మంది వ్యాపార సంస్థల ప్రతినిధులు సభ్యులై ఉన్నారని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది బీఎన్ఐ రూ.78.5 కోట్ల మేర వ్యాపార మార్గాలను చూపిందని చెప్పారు. ఎక్స్‌పోలో లైఫ్ స్టయిల్, బంగారు ఆభరణాలు, గృహ సంబంధిత వస్తువులు, రియల్‌ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల కంపెనీలు స్టాల్స్‌లో ప్రదర్శన ఏర్పాటు చేశాయి. కోనసీమ జిల్లావ్యాప్తంగా వందలాది మంది వ్యాపారులు, వినియోగదారులు ఎక్స్‌పోను సందర్శించారు.

వర్మకు ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ



వర్మ తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్

కాట్రేనికోన: మాతృ వియోగంతో బాధపడుతున్న నడవపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు పాకలపాటి పాకలపాటి సత్యమాంబిక వర్మను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పరామర్శించారు. వర్మ తల్లి వృద్ధాప్యంతో మృతి చెందింది. ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో జెడ్పీటీసీ నేల కిషోర్, సర్పంచ్ దొమ్మేటి పల్లవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్ల నరసింహమూర్తి, నాయకులు నడింపల్లి సూరిబాబు, అక్కల శ్రీధర్, మోకా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చింతాకు ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ

ముమ్మిడివరం: పితృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చింతా నాగ మునీంద్రరావును ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పరామర్శించారు. మునీంద్రరావు తండ్రి ఇటీవల వృద్ధాప్యంతో మృతి చెందాడు. కర్రివానిరేవులోని మునీంద్రరావు స్వగృహంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ కోలా గంగాభవానీ, సర్పంచ్ కాశీభాగ్యలక్ష్మి, కోలా బాబ్జి తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీలోకి 200 మంది టీడీపీ కార్యకర్తలు

కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే పొన్నాడ



ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలు

కాట్రేనికోన: కాట్రేనికోన మండలం పల్లంకుర్రు గ్రామ పంచాయతీ మొల్లేటి మొగకు చెందిన ఓలేటి గంగాద్రి, కాలాడి కాయరాజుల ఆధ్వర్యంలో సుమారు 200 మంది టీడీపీ కార్యకర్తలు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పొన్నాడ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పేదలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు చెప్పారు. ఇటీవల ఓఎన్‌జీసీ నష్టపరిహారాన్ని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పార్టీలకతీతంగా అర్హులందరికీ అందించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేలకిషోర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, బ్రహ్మం తదితరులున్నారు.

ఘనంగా ప్రారంభమైన మహా సౌరయాగం



పృథ్వీరాజ్‌తో మహా సౌరయాగ సంకల్పం చేయిస్తున్న పండితులు

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామంలోని బసవయ్య అగ్రహారం శ్రీరామ మందిరం వద్ద మహా సౌరయాగం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ యాగ సంకల్పం చేసి, యాగశాల ప్రవేశం చేశారు. యాగ కర్త మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. నెల రోజుల పాటు జరిగే ఈ మహాయాగంలో భాగంగా మొదటి రోజు శ్రీ చక్ర అర్చన, సూర్య నమస్కారాలు, సౌర అష్టాక్షరీ జపాలు నిర్వహించారు. నేడు ధనిష్ట నక్షత్ర జాతకులకు జమ్మి వృక్షానికి పూజలు జరుగుతాయని యాగకర్త తెలిపారు. కార్యక్రమంలో దత్తాత్రేయ శర్మ, సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, జయన సత్తిరాజు, కర్రా కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రాంమాధవ్‌కు రైల్వేలైను కోసం వినతులు



రాంమాధవ్‌కు కోనసీమ రైలు కోసం వినతి పత్రం అందిస్తున్న రైల్వే సాధన సమితి ప్రతినిధులు

అమలాపురం రూరల్: అమలాపురానికి వచ్చిన ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యవాహ వారణాసి రాంమాధవ్‌కు కోనసీమలో రైల్వే లైన్ కోసం ఉద్యమాలు చేస్తున్న కోనసీమ రైల్వే సాధన సమితి, కోనసీమ యువ రైల్వే సాధన సమితి ప్రతినిధులు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఆదివారం స్థానిక సర్ సీవీ రామన్ స్కూలులో సదరు రెండు సమితుల ప్రతినిధులు రాం మాధవ్‌ను కలిసి కోనసీమ రైల్వే పనులు ముందుకు సాగేలా కృషి చేయాలని అభ్యర్థించారు. రాంమాధవ్‌ను కలిసినవారిలో కోనసీమ రైల్వే సాధన సమితి కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, సమితి ప్రతినిధులు కుడుపూడి సూర్యనారాయణరావు, కల్వకొలను తాతాజీ, సప్పా నాగేశ్వరరావు, కోనసీమ యువ రైల్వే సాధన సమితి అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధా కొండ తదితరులున్నారు. సమితులు ఇచ్చిన వినతులపై స్పందించిన రాంమాధవ్ మరోసారి గట్టి ప్రయత్నం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. స్థానిక కిమ్స్ వైద్య కళాశాలలో రాంమాధవ్‌ను మాజీ ఎమ్మెల్సీలు, కిమ్స్ అధినేతలు చైతన్యరాజు, రవికిరణ్ వర్మలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో బీజేపీ నేతలు యాళ్ల దొరబాబు, మానేపల్లి అయ్యాజీ వేమా, మోకా వెంకట సుబ్బారావు, నల్లా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన మహిళా పోలీస్



బిడ్డను లాలిస్తున్న మహిళా పోలీస్ గణిత

కాట్రేనికోన: కాట్రేనికోన పోలీస్‌స్టేషన్‌కు చెందిన మహిళా పోలీస్ గణిత మానవత్వం చాటింది. చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రానికి విజయనగరం నుంచి పరీక్షలు రాసేందుకు రెండేళ్ళ బిడ్డతో మహిళా అభ్యర్థిని వచ్చింది. పరీక్షా కేంద్రం వద్ద డ్యూటీలో ఉన్న గణిత ఆ బిడ్డను లాలిస్తూ కనిపించింది.

రఫెల్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి



ఫ్రెంచి ఇండియా స్వాతంత్ర్య సమరయోధుడు రఫెల్ పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖులు

యానాం: సుమారు 200 ఏళ్లపాటు ఫ్రెంచివారు పాలించిన యానాం ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు పోరాడిన స్వాతంత్ర్య సమర యోధుడు దడాల రఫెల్ రమణయ్య జీవితచరిత్రను పుదుచ్చేరి ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని పలువురు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎస్ఎస్ఏ కాన్ఫరెన్స్ హాలులో ప్రముఖ చరిత్రకారుడు, కవి బొల్లోజు బాబా రచించిన ఫ్రెంచి ఇండియా స్వాతంత్ర్య సమరయోధుడు పుస్తకావిష్కరణ సభ ప్రముఖ కవి దాట్లదేవదానం రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలైమామణి, జనమిత్ర ఎడిటర్ పొనుగుమట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ ఫ్రెంచివారి నుంచి యానాంకు స్వాతంత్ర్యం తెచ్చేలా రఫెల్ చేసిన పోరాటం ఐక్యరాజ్యసమితిలో ఫ్రాన్స్ ప్రభుత్వం ఫిర్యాదుతో ఆయనపై చర్చించడం విశేషమన్నారు. రఫెల్ స్వీయ రచన «మై స్ట్రగుల్ ఫర్ ద ఫ్రీడమ్ ఆఫ్ ఫ్రెంచ్ ఇండియా»ను తెలుగులో అనువదించాలని కోరారు. అనంతరం రచయిత బొల్లోజు బాబాను పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించి ఆయన కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఎడీపీసీ కమిడి ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఉపాధ్యాయుడు ముమ్మిడి చిన్నారి, నక్కావాసుదేవరావు, ప్రముఖ న్యాయవాది కోలా సత్యప్రసాద్, రఫెల్ మనుమరాలు సామిలి, కోడలు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ సాధనకు ప్రజా ఉద్యమం



అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సంఘం నేతలు

అమలాపురం రూరల్: కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ సాధనకై కోనసీమ జిల్లావ్యాప్తంగా విద్యార్థులు యువకులు, ఉద్యోగులు అన్ని వర్గాల వారితో ప్రజా ఉద్యమం చేస్తామని కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధులు తెలిపారు. రైల్వే నిర్మాణ పనులు నిలిపివేయడంపై నిరసన వ్యక్తం చేస్తూ ఆదివారం భట్నవిల్లి గ్రామంలో రైల్వే శాఖ మంత్రి వేలు శంకుస్థాపన చేసిన శిలాఫలకం వద్ద అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా కోటిపల్లి నరసాపురం రైల్వేలైన్ నిర్మాణంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయని ఆరోపించారు. అంచనా వ్యయం పెరిగి భవిష్యత్తులో కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ పూర్తవుతుందో లేదోనన్న సందేశం ప్రజల్లో ఏర్పడిందన్నారు. రైల్వే లైన్ నిర్మాణం కోసం అతిత్వరలో నిరసన ర్యాలీ చేపడతామని, దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. సమావేశంలో జంగా బాబురావు, డీబీ లోక్, బొంతు రమణ, రేవు తిరుపతిరావు, కారెం వెంకటేశ్వరరావు, గుంగుమళ్ల శ్రీనివాస్, బత్తుల సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

ముమ్మిడివరం: అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని గర్భం దాల్చిన ఘటనలో పాఠశాల ప్రిన్సిపాల్, హెల్త్ అసిస్టెంట్‌ను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని ఆర్‌పీఐ ప్రధాన కార్యదర్శి చీకురుమిల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రతి గురుకులంలో మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా విద్యార్థిని బిడ్డకు జన్మనిచ్చే వరకు గమనించక పోవడం ప్రిన్సిపాల్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఐ పోలవరం: మండల పరిధిలో కొమరిగిరి 216 జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం భీమవరం నుంచి కాకినాడ వైపుకు వెళుతున్న కారు అదుపు తప్పి కొమరిగిరి వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. బైక్‌పై ఉన్న ఇద్దరిలో పోలిశెట్టి వీరబాబుకు తీవ్రగాయాలైనట్లు తెలిసింది. ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను 108 వాహనంలో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ రాజేష్ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

టీడీపీ నాయకుల పర్యటన

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం గ్రామ పంచాయితీ పరిధిలో మండల టీడీపీ అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. అమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ అయితాబత్తుల ఆనందరావు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తమకు చదువులు చెప్పిన గురువులతో 1994-95 బ్యాచ్ విద్యార్థినులు

యానాం: దాదాపు మూడు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న చిన్ననాటి మిత్రులంతా తిరిగి చదువులమ్మ చెట్టు నీడలో కలుసుకున్నారు. స్థానిక కమలా నెహ్రూ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో 1994-95 బ్యాచ్ విద్యార్థినులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకుని సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాల్ని నెమరవేసుకుంటూ రోజంతా కబుర్లతో ఆనందోత్సాహాలతో గడిపారు. 29 ఏళ్ల క్రితం తాము చదువుకున్న క్లాస్ రూమ్‌ల్లో కలియతిరిగారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పి ప్రయోజితులను చేసిన గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం భోజనాలు, ఆటలు, పాటలు, స్లామ్‌బుక్స్, ఫొటోలతో సందడి చేస్తూ చిన్నపిల్లలైపోయారు. ఆదివారం సాయంత్రం ఉద్వేగభరిత వాతావరణంలో వీడ్కోలు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు పుష్ప, ప్రభ, సరిత, మణి, షబ్నమ్ తదితరులు పాల్గొన్నారు.